క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న మంజుల-రవి

సుల్తానాబాద్: పట్టణంలోని పూసాల లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయ పునర్ నిర్మాణానికి వరలక్ష్మి క్లాత్ సెంటర్ యజమాని గాదాసు మంజుల-రవి దంపతులు రూ10,116 విరాళంగా అందజేశారు. శ్రీలక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో దాతలు పునర్ నిర్మాణానికి సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ కోట రంగారెడ్డి కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్యగౌడ్ ఆలయ కమిటీ సభ్యులు పురం రమణ, వడాల శేఖర్, వెంకటలక్ష్మి రాజేశ్వరి ఉన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



సన్మానిస్తున్న గ్రామస్తులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని తారుపల్లి గ్రామంలో ఉద్యోగ విరమణ పొందిన పోస్టు మాస్టర్ యాంసాని వెంకటేశ్వర్లును ఆదివారం గ్రామస్తులు, సిబ్బంది సన్మానించారు. అదే వేదికపై ఉద్యోగ విరమణ పొందిన వెంకటేశ్వర్లు-పద్మ దంపతుల షష్టిపూర్తి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బైరం రమేశ్, ట్రాన్స్‌కో రిటైర్డ్ సీజీఎం ఎ.రాఘవులు, మాజీ సర్పంచులు మూడెత్తుల లింగయ్య, లక్ష్మి, ఆర్యవైశ్య సంఘం నాయకులు వై రాఘవులు, కె.అశోక్, అనంతరాములు, సిబ్బంది శ్రీనివాస్, ముత్తయ్య, వెంకటేశ్, కృష్ణమూర్తి, చందు, రాజమౌళి, ప్రకాశ్‌నాయక్, అజయ్, నరసయ్య, చోటేమియా, రాజ్‌మహ్మద్, స్వామి పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ఉత్సవాల్లో భక్తులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేటలోని శ్రీసీతాలక్ష్మణ సమేత భక్త హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆలయాన్ని పునర్ నిర్మించి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు. సర్పంచ్ చీకటి స్వరూప దంపతులతో పాటు మాజీ సర్పంచ్ రమాదేవి దంపతులు పాల్గొన్నారు.

అబ్బిడిపల్లె సర్పంచ్‌కు తెలుగు వెలుగు అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

ఓదెల: మండలంలోని అబ్బిడిపల్లె సర్పంచు ఒజ్జ శ్రీనివాస్ తెలుగు వెలుగు సాహితీ తరపున ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఆదివారం విజయవాడలో జరిగిన సాహితీ వేదికలో ఉత్తమ సేవలు అందించినందుకుగాను గుర్తించి ప్రతినిధులు ఉత్తమ అవార్డు ప్రదానం చేశారు.

అన్నదానం



కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వెన్నంపల్లి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి నాగభూషణం రమాదేవి దంపతులు తమ మాతృమూర్తులు రాజేశం రాజేశ్వరి, సుశీల జ్ఞాపకార్థం ఆదివారం పెద్దపల్లి స్ఫూర్తి మానసిక దివ్యాంగుల కేంద్రంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి ప్రత్యేక అలంకరణ

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయంలో స్వామివారికి పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆదివారం పలువురు దంపతులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మొక్కులు చెల్లించారు. హాజరైన భక్తులకు పూజారులు మహేశ్, రమేశ్ తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ ఉన్నారు.

నాటుతున్నారు.. నరికేస్తున్నారు





జీడీనగర్ గ్రామ ప్రధాన రహదారిపై నరికివేసిన చెట్లకొమ్మలు

- విద్యుత్ తీగలకు తాకుతున్నాయని హరితహారం మొక్కల నరికివేత
- లక్షల రూపాయల ప్రజాధనం వృథా
- అధికారులు, పాలకుల తీరుపై విమర్శ

పాలకుర్తి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి. ఇది మన సామాజిక బాధ్యత.. నేడు మనం నాటే మొక్కలే, రేపటి భవిష్యత్ తరాలకు ఆస్తులు. ఇవి తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా నాయకులు, అధికారులు చెప్పిన మాటలు. కానీ ప్రస్తుతం అధికారులు, పాలకుల అనాలోచిత చర్యలతో రూ.లక్షలు వెచ్చించి నాటి సంరక్షించిన చెట్లను విచ్చలవిడిగా నరికేస్తున్నారు. పాలకుర్తి మండలం జీడీనగర్ గ్రామ ప్రధాన రహదారికి ఇరువైపులా తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా నాలుగేళ్ల క్రితం మొక్కలు నాటారు. అయితే విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడంతో ప్రస్తుతం అవి పెరిగి పెద్దవై విద్యుత్ లైన్లను తాకుతున్నాయి. దీంతో సంబంధిత శాఖ అధికారులు చెట్లకొమ్మలను నరికివేశారు. రూ.లక్షల ప్రజాధనం వెచ్చించి నాటిన మొక్కలను చివరకు విద్యుత్ తీగలు తాకుతున్నాయనే నెపంతో నరికేస్తున్నారు. మొక్కలు నాటే సమయంలోనే అధికారులు పర్యవేక్షించి వాటిని తీగలకు దూరంగా నాటిస్తే ప్రస్తుతం ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి పాటుపడతా



రామగుండం: హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ను కలిసిన గీత కార్మికులు

రామగుండం: నియోజకవర్గ పరిధిలోని గీత కార్మికుల సంక్షేమానికి పాటుపడతానని, గీత కార్మికుల కులవృత్తులను ప్రోత్సహిస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం సర్వాయి పాపన్న గీతకార్మిక సంఘం రాష్ట్ర ప్రతినిధులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తన నియోజకవర్గ పరిధిలో గీత కార్మికులు వృత్తి పరికరాలను పరిరక్షించుకునేందుకు పనిస్థలాల్లో షెల్టర్ల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింగం సత్తయ్యగౌడ్, సీనియర్ నాయకులు మేర్గు హన్మంతుగౌడ్, కోల లక్ష్మణ్‌గౌడ్, బాలసాని అంజయ్యగౌడ్, కోల రామ్మూర్తిగౌడ్, మడ్డి వెంకటేశ్‌గౌడ్, పైడిపల్లి రామ్మూర్తిగౌడ్, సింగం కిరణ్‌కుమార్, మడ్డి బాపుగౌడ్, బైరి కిరణ్‌గౌడ్ ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఘనస్వాగతం

పాలకుర్తి: రామగుండం ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం హైదరాబాద్‌లో ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారి నియోజకవర్గానికి విచ్చేసిన మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. కన్నాల టోల్‌ప్లాజా, బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద వేర్వేరుగా కాంగ్రెస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను సత్కరించారు. నాగలి బహూకరించారు. అనంతరం బైక్‌లపై ర్యాలీగా గోదావరిఖనికి వెళ్లారు.

లోక కల్యాణార్థం చండీహోమం నిర్వహణ



చండీహోమంలో వేదపండితులు, భక్తులు

రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయ సన్నిధానంలో ఆదివారం లోక కల్యాణార్థం, పట్టణ, గ్రామాభివృద్ధి కోసం చండీహోమం నిర్వహించారు. డిసెంబర్ 2 నుంచి ప్రతీరోజు శ్రీదేవీ భాగవత్ జ్ఞానయజ్ఞం నిర్విరామంగా నిర్వహించగా ఆదివారం ముగిసింది. ఆలయ ప్రాంగణంలో ప్రజాశ్రేయస్సు కోరుతూ చండీహోమం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ వేడుకల్లో విశిష్ట అతిథిగా బ్రహ్మశ్రీ మారుపాక సత్యనారాయణశర్మ పాల్గొన్నారు. ఆలయ పూజారి కమ్మల చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన హోమంలో వేద పండితులు చంద్రమౌళిశర్మ, శ్రీనివాసాచారి, నాగేంద్రశర్మ, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కోలాహలం శ్రీనివాస్‌రావు, తాటిపెల్లి శివప్రసాద్, కౌశిక వెంకటరమణ, పల్లెర్ల అంజయ్య, దొంతుల రామన్న, మాధవి దంపతులు హోమంలో పాల్గొన్నారు. పట్టణంలోని భక్తులు, అయ్యప్ప మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

బీ థర్మల్ కేంద్రంలో నిరంతర విద్యుత్ ఉత్పత్తి



బీ-థర్మల్ కేంద్రం

రామగుండం: పెద్దపల్లి జిల్లా రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రంలో నెల రోజులుగా నిరంతరం విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. 62.5 మెగావాట్ల సామర్థ్యం గల కేంద్రంలో గరిష్ఠంగా రోజూ 43 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నట్లు అధికారులు తెలిపారు. దసరా పర్వదినం రోజు విద్యుత్ కేంద్రంలోని కీలక విభాగంలో షార్ట్ సర్క్యూట్‌తో టర్బయిన్, బాయిలర్‌లో మంటలు చెలరేగాయి. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి షట్‌డౌన్ చేయడంతో భారీ ప్రమాదం తప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నెలరోజుల పాటు ఇంజినీర్లు, ఉద్యోగులు శ్రమించి కాలిన కేబుల్స్ స్థానంలో కొత్తవి తెప్పించి గత నెల 9న విద్యుత్ కేంద్రాన్ని ఉత్పత్తి దశలోకి తీసుకువచ్చారు. ఎంతో శ్రమించిన ఇంజినీర్లు.. ఎంతకాలం ఉత్పత్తి సాగుతుందోనని, ఏమైనా ప్రమాదాలు ఎదురవుతాయోనని ఆందోళన చెందారు. అయితే, నెలరోజులుగా ఎలాంటి సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కాకుండా, నిరాటకంగా విద్యుత్ ఉత్పత్తి సాగుతుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

హామీలు విస్మరిస్తే.. ప్రజల గొంతుకగా నిలుస్తాం



మాట్లాడుతున్న వెంకటేశ్ పటేల్

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను విస్మరిస్తే ప్రజల గొంతుకగా నిలుస్తామని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్‌పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గాన్ని ఇండస్ట్రీస్ ఏరియాగా తీర్చిదిద్దాలని, బెల్ట్ షాపులు తొలగించాలని, అక్రమ మట్టి దందా, ఇసుక మాఫియాను అరికట్టాలని కోరారు. ఎలిగేడు మండలం దూళికట్ట గ్రామ పరిధిలో ఉన్న అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినటువంటి బౌద్ధ స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ మతిన్, ఆరెపల్లి అజయ్‌కుమార్, గోస్కుల రాజయ్య, సోహెల్, సింగసాని అనిల్‌కుమార్, మనోహర్, మౌనిక, కవిత పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఓదెల: పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావును ఓదెల మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం మొట్టమొదటి సారిగా శాలువాలను కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, జిల్లా నాయకులు చీకట్ల మొండయ్య, మాజీ సర్పంచు పుప్పాల శంకర్, మాజీ ఉపసర్పంచు వీరన్న, మాజీ ఎంపీటీసీ శంకర్ పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీకి కాంగ్రెస్ నాయకులు

జూలపల్లి: పెద్దపల్లి నుంచి నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికై, అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసి తన నియోజకవర్గానికి మొదటిసారిగా విచ్చేసున్న ఎమ్మెల్యే విజయరమణరావుకు స్వాగతం పలికేందుకు మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. కాంగ్రెస్ నాయకులు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, పార్టీ అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, గండు సంజీవ్, నాయకులు లోక జలపతిరెడ్డి, పోట్టాల శంకరయ్య, బండి స్వామి, కొమ్మ పోచాలు, కొమురయ్య, కొట్టె రాజయ్య దుబ్బపల్లె నుంచి బైక్ ర్యాలీలో పాల్గొనేందుకు తరలి వెళ్లారు.

ఎమ్మెల్యేకు స్వాగతం పలికేందుకు బైక్ ర్యాలీ

ఎలిగేడు: కాంగ్రెస్ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అత్యధిక మెజార్టీతో గెలిచి, అసెంబ్లీలో శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసి మొదటి సారిగా పెద్దపల్లికి వచ్చారు. ఆదివారం ఎలిగేడు మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు బైక్‌లతో సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి వరకువెళ్లారు. అక్కడి నుంచి పెద్దపల్లి వరకు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, పోల్సాని పుల్లారావు, అమ్ముల శ్రీనివాస్, అమ్ముల రమేశ్, భూర్ల వెంకటసత్యం, గొల్లె భూమేశ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

మనోచైతన్య వృత్తి శిక్షణ కేంద్రం సందర్శన



పాఠశాల గదులను పరిశీలిస్తున్న అధికారులు

గోదావరిఖనిటౌన్: స్థానిక మనోచైతన్య దివ్యాంగుల వృత్తి శిక్షణ కేంద్రాన్ని సింగరేణి డైరెక్టర్ పా అండ్ ఫైనాన్స్ ఎస్.బలరాం, ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ పా మాట్లాడుతూ దివ్యాంగులైన పిల్లల్లోని నిష్పక్షపాత ప్రేమ ఎంతో గొప్పదన్నారు. వారికి సమాజంలోని వివిధ అంశాలతో కూడిన మెలకువలు నేర్పి వారిలో దాగి ఉన్న శక్తిని వెలికితీయాలన్నారు. మానసిక దివ్యాంగుల అభ్యున్నతికి సింగరేణి తనవంతు సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను, తరగతి గదులను పరిశీలించారు. మనోచైతన్య నిర్వాహకులు డి.కృష్ణకుమార్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ



జేసీబీతో లారీలను తొలగిస్తున్న పోలీసులు

జ్యోతినగర్: పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారిపై రెండు బూడిద లోడ్ లారీలు ఢీకొన్నాయి. మేడిపల్లి సెంటర్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆసిఫాబాద్‌కు చెందిన డ్రైవర్ మునేశ్ బూడిద లోడ్‌తో వస్తుండగా అదేమార్గంలో రాజు కేవత్ మరో బూడిద లోడ్ లారీతో వెళ్తున్నాడు.ఈ క్రమంలో ముందున్న లారీ అకస్మాత్తుగా నిలిచిపోయింది. దీంతో వెనుకాలే ఉన్న లారీ దానిని ఢీకొంది. రెండు వాహనాలు ధ్వంసం కావడం, రోడ్డుపై నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి జేసీబీ సాయంతో లారీలు తొలగించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

యూనివర్సిటీ పోటీలకు గాయత్రీ విద్యార్థి ఎంపిక



అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రీ డిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థి మనోజ్ శాతవాహన యూనివర్సిటీ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 11నుంచి 15దాకా కర్ణాటకలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన మనోజ్‌ను గాయత్రీ విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్ అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ రవీందర్, అధ్యాపక బృందం అభినందించారు.

అయోధ్య అక్షింతలతో విశ్వహిందూ పరిషత్ శోభాయాత్ర



శ్రీరాముని అక్షింతల కలశంతో శోభాయాత్ర

గోదావరిఖనిటౌన్: అయోధ్య శ్రీరామ మందిరంలోని అక్షింతలను ప్రత్యేక రథంలో గోదావరిఖని బస్టాండ్‌కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పురవీధుల గుండా స్థానిక కోదండ రామాలయం వరకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి అయోధ్య రవీందర్ మాట్లాడుతూ అయోధ్యలోని శ్రీరామ మందిర నిర్మాణం, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో భాగమైన ప్రతి హిందువుకు శ్రీరాముని అక్షింతలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. నగర కార్యదర్శి మేడగోని రవీందర్, మోడెం సురేందర్, బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ ముస్కె సంపత్‌యాదవ్, నేరేడుగొమ్మ వెంకటస్వామి, కొండపర్తి లింగన్న, మునిగాల సంపత్, ములికుంట్ల శ్రీనివాస్, పైతరి రాజు, ఆరెల్లి జలేందర్, అన్నపూర్ణ, సూర్యదేవర జ్యోతి, కోట తిరుమల పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలు వెంటనే నెరవేర్చాలి

మంథని: నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పోతరవేని క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. రైతుబంధు నిధులు తమ ఖాతాల్లో జమ చేస్తామని.. అంతేకాకుండా వడ్లకు రూ.500 బోనస్ పెంచుతూ వెంటనే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. అసెంబ్లీ సమావేశాల మొట్టమొదటి రోజునే డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామన్న హామీలను వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

మిస్సింగ్ కేసు నమోదు

మంథని: మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన మౌనిక, ఆమె కూతురు పల్లవి శనివారం నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ తెలిపారు. రేడవేన రమేశ్ తన తండ్రి ఆరోగ్యం బాగా లేక శనివారం హాస్పిటల్‌కు వెళ్లివచ్చేసరికి అతని భార్య, కూతురు మౌనిక, పల్లవి ఇంటి వద్ద లేరు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మంత్రులకు శుభాకాంక్షలు



శ్రీధర్‌బాబును కలిసిన రవీందర్



శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న సర్పంచ్ లావణ్య

పెద్దపల్లిరూరల్: జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సురేందర్ సన్నీ, అంబేడ్కర్ సంఘం రాష్ట్ర నేత గజ్జెల కాంతం రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహను ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రాజనర్సింహను సంగారెడ్డిలో కలిసి శుభాకాంక్షలు తెలిపామని పేర్కొన్నారు.

గెజిటెడ్ అధికారుల సంఘం నేత

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆదివారం జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు తూము రవీందర్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఉద్యోగ సమస్యలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

శ్రీధర్‌బాబును కలిసిన ముస్త్యాల సర్పంచ్

యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్ మంథని ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్‌బాబును రామగిరి మండలం ముస్త్యాల సర్పంచ్ లావణ్య ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సీతక్కను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మక్కాన్‌సింగ్‌ను కలిసిన కాంగ్రెస్‌నేతలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో ఆదివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్ తొలిసారిగా పెద్దపల్లికి చేరుకున్న సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి బి.రమేశ్‌గౌడ్ ఘనంగా సత్కరించారు. మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అక్బర్ అలీ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కల్వల శ్రీనివాస్ ఉన్నారు.

టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా ప్రభాకర్‌రావు



ప్రభాకర్‌రావు



శ్రీనివాస్‌గౌడ్

సుల్తానాబాద్‌రూరల్: రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా సుంకిశీల ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా గుర్రం శ్రీనివాస్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో ఆదివారం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి తంగూరి సురేశ్, పరిశీలకులు కటకం రవి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా రవీందర్‌రావు, విట్టల్, రామయ్య, కార్యదర్శులుగా ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్, మైనారిటీ సెల్ కన్వీనర్‌గా కాజామియా, స్టేట్ కౌన్సిలర్లుగా రవికుమార్, లక్ష్మీనారాయణ, విట్టల్, శ్రీనివాస్ ఎన్నికైనట్లు తెలిపారు.

స్టాండర్‌డైజేషన్ కమిటీ సభ్యుడిగా సత్తయ్య



గోదావరిఖని: దేశవ్యాప్త బొగ్గుగని కార్మికుల సమస్యలపై చర్చించే అత్యంత ప్రాధాన్యత కలిగిన స్టాండర్‌డైజేషన్ కమిటీ సభ్యుడిగా బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్యను నామినేట్ చేసినట్లు జాతీయ నేత కొత్తకాపు లక్ష్మారెడ్డి ప్రకటించారు. ఆదివారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. సింగరేణి చరిత్రలో స్టాండర్‌డైజేషన్ కమిటీలో ఇప్పటివరకు అవకాశం లేదన్నారు.

స్కూల్‌బ్యాగుల పంపిణీ



జ్యోతినగర్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందించారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని దుర్గయ్యపల్లె ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం సభ్యులు స్కూల్‌బ్యాగులు అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండంకు చెందిన తానిపర్తి విజయలక్ష్మి, కళావతి, మనీషా అగర్వాల్, రాజిరెడ్డి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, సోమారపు లావణ్య, హెచ్‌ఎం రేణుక, రాణి, ఆకుల రాజన్న, దేవిక, రమణ పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతు జరిగేనా?



కోతకు గురైన ఐతరాజుపల్లికి వెళ్లే రోడ్డు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని రోడ్లు వర్షాకాలంలో వరద తాకిడి గురైనా నేటికీ మరమ్మతుకు నోచుకోవడం లేదు. మండలంలోని నీరుకుల్ల, గట్టెపల్లి, కదంబాపూర్, మంచిర్యామి, తొగర్రాయి, ఐతరాజుపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్లు గత వర్షాకాలంలో కురిసిన వర్షాలతో రోడ్లు ధ్వంసం అయ్యాయి. దీంతో అధికారులు అంచనా వేసి మరమ్మతు చేయించాలి. కానీ నేటికీ మరమ్మతుకు నోచుకోకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.